సాగు..సాగేనా?

తడబడుతున్న కాలం
- చిరుజల్లులతో పదునెక్కని పొలాలు
- వెలవెలబోతున్న చెరువులు
- అందని ఉత్తరకాలువ నీళ్లు
- తాగునీటికి అల్లాడుతున్న మూగజీవాలు
- వరుణుడి కరుణ కోసం అన్నదాతల ఎదురుచూపులు

అనుమసముద్రంపేట: ఈ ఏడాది కాలం తడబడుతోంది. ప్రతిరోజూ మేఘాలు కమ్ముకుంటున్నా చిరుజల్లులు తప్ప భారీ వర్షాలు కురవడం లేదు. చెరువులు చుక్కనీరు లేక వెలవెలబోయి దర్శనమిస్తున్నాయి. మూగజీవాలు సైతం తాగునీటికి అల్లాడుతున్నాయి. గతంలో వర్షాలు లేకపోతే ఉత్తర కాలువ ద్వారా చెరువులకు సోమశిల జలాలు వదిలే వారు. ఈ ఏడాది సోమశిల జలాశయం సైతం అడుగంటడంతో ఉత్తర కాలువకు నీటి విడుదలను నిలిపేశారు. దీంతో ఈ ఏడాది సాగు సాగేనా..అని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరుణుడి కరుణ కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. ఏఎస్పేట మండలం మెట్ట ప్రాంతం. వర్షాలు పడకపోయిన సోమశిల జలాశయంలో నీరు ఉంటే రెండు కారుల పంటలను రైతులు పండిస్తారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా భారీ వర్షాలు పడకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. మండలంలో దాదాపు 33 గ్రామాలు ఉండగా, 32 చెరువులు ఉన్నాయి. ఏటా అధికారికంగా పది వేల ఎకరాల సాగు చేస్తుండగా, అనధికారికంగా మరో రెండు వేల ఎకరాలను రైతులు సాగు చేసేవారు. గత నెల కంటే జూలైలో కొద్దిపాటి వర్షం కురిసింది. అయినా భూమి పదును కాకపోవడంతో రైతులు ఎలాంటి సాగు ఆలోచన చేయలేదు. దీంతో పంటల సాగు గణనీయంగా తగ్గింది. మండలంలోని రైతులు ప్రధానంగా వరి పంటను సాగు చేస్తారు. గత సీజన్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ ఉత్తర కాలువ ద్వారా నీటిని విడుదల చేయడంతో పంట సాగు చేపట్టారు. ఈ ఏడాది ఇప్పటి వరకు భారీ వర్షాలు పడకపోవడంతో రైతులు ఆకాశం వంక ఆశగా చూస్తున్నారు. గతేడాది సోమశిల జలాశయంలో నీరు తక్కువగా ఉన్నప్పటికీ పశువుల తాగునీటి కోసం చెరువులకు నీరందించారు. ఈ ఏడాది పశువుల తాగునీటి కోసం కూడా ఉత్తరకాలువ నీరు విడుదల చేయకపోవడంతో చెరువులు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. దీంతో మూగజీవాలు సైతం తాగునీటికి అల్లాడుతున్నాయి. ఈ పరిస్థితులను చూసి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడకపోతే పంటలు పండించలేమనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఉత్తర కాలువ ద్వారా సాగునీరు అందినా ఈ ఏడాది పంటలు పండించుకోవచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


చుక్కనీరు లేని అనుమసముద్రం చెరువు


బీడుగా ఉన్న సాగుభూమి

అయోమయంగా ఉంది



ఈ ఏడాది సాగు పరిస్థితి అయోమయంగా ఉంది. ఇప్పటి వరకు భారీ వర్షాలు పడకపోవడంతో చెరువులు వెలవెలబోయి దర్శనమిస్తున్నాయి. సోమశిల కూడా అడుగంటడంతో ఉత్తరకాలువ ద్వారా సాగునీరు వచ్చే పరిస్థితి లేదు. దుక్కులు దున్నుకుని విత్తనాలు పోసేందుకు సిద్ధంగా ఉన్నాం. నార్లు పోసిన నీళ్లు వస్తాయో..లేదోనని అనుమానంగా ఉంది.

–చౌడిరెడ్డి, రైతు, అనుమసముద్రం

పశువులకు తాగునీరు లేదు



గ్రామం చుట్టూ ఎటుచూసినా పశువులు తాగేందుకు సైతం చుక్కనీరు ఎక్కడా కనిపించడం లేదు. వర్షాలు అంతంత మాత్రమే. ఉన్న మూడెకరాలను దుక్కి దున్ని సిద్ధంగా చేసుకున్నప్పటికీ సాగునీరు అందదేమోనన్న భయంగా ఉంది. వర్షాలు కురిస్తే ఆ నీటితోనైనా నారుమడులు పోసుకుంటాం.

–దేవరపాటి సుబ్బారెడ్డి, రైతు, అనుమసముద్రం

క్లుప్తంగా

ముమ్మరంగా కుష్టు సర్వే



వరికుంటపాడు: మండలంలో కుష్టు సర్వేను ముమ్మరంగా చేపడుతున్నారు. కృష్ణంరాజుపల్లె, రామదేవులపాడు గ్రామాల్లో జరుగుతున్న కుష్టు సర్వేను సీహెచ్‌ఓ రాజశేఖర్‌రాజు, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటయ్య శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు వైద్యఆరోగ్య సిబ్బంది మండలంలోని 1500 గృహాలను సందర్శించి సర్వే చేపట్టినట్లు తెలిపారు. కుష్టు లక్షణాలు ఉన్న వారిని గుర్తించి జాబితాను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు చెప్పారు. వారి సూచనల మేరకు బాధితులకు చికిత్స అందిస్తామన్నారు.

కేజీబీవీకి వంట పాత్రల వితరణ



కలిగిరి: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయానికి బ్యాంక్ ఆఫ్ బరోడా కలిగిరి బ్రాంచ్ మేనేజర్ సతీష్‌కుమార్ వంట పాత్రలు, కుర్చీలను శనివారం వితరణ చేశారు. బ్యాంక్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రూ.10వేల విలువ చేసే సామగ్రిని అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుప్రియ, జేవీవీ నాయకుడు మేడం నరసింహారెడ్డి, బ్యాంక్ సిబ్బంది నరసయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా గంధ మహోత్సవం



ఆత్మకూరు: పట్టణంలోని హజ్రత్ సుల్తాన్ షహీద్ దర్గాలో గంధ మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. తొలుత గంధాన్ని ఊరేగింపుగా దర్గా వద్దకు చేర్చారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గంధాన్ని హజ్రత్ సుల్తాన్ షహీద్ సమాధికి లేపనం చేశారు. తదుపరి భక్తులకు గంధ ప్రసాదాన్ని పంచిపెట్టారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


నీటి పరీక్షలు చేస్తున్న ఎంపీడీఓ

కలిగిరి: సచివాలయ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు హెచ్చరించారు. కృష్ణారెడ్డిపాళెం గ్రామ సచివాలయాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం మంచినీటి ట్యాంక్‌ను పరిశీలించి నీటి పరీక్షలు జరిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి చెంచుకృష్ణారెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు


చికిత్స పొందుతున్న షఫీవుల్లా

దుత్తలూరు: మండలంలోని నందిపాడు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు..ఉదయగిరిలోని దిలావర్‌భాయ్ వీధికి చెందిన అజ్మతుల్లా, షఫీవుల్లా మోటార్‌సైకిల్‌పై నందిపాడులోని బంధువుల ఇంటికి వచ్చారు. తిరిగి ఉదయగిరికి వెళ్తున్న క్రమంలో నందిపాడులోని మసీదు ఎదురుగా ఉన్న స్పీడ్‌బ్రేకర్ వద్ద మోటార్‌సైకిల్ అదుపుతప్పి పడిపోవడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహన సిబ్బంది ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఫ్యామిలీడాక్టర్ సేవలు

వరికుంటపాడు: మండలంలోని తూర్పుచెన్నంపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ సేవలను శనివారం అందజేశారు. వైద్యాధికారిణి కరిష్మా 48 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

చేజర్ల: రైతు ఉత్పత్తిదారుల సంఘంపై అవగాహన సదస్సును మండలంలోని నూతక్కివారికండ్రిగలోని పెనుశిల లక్ష్మీనరసింహ ఉద్యాన రైతు సంఘంలో శనివారం నిర్వహించారు. నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రైతు ఉత్పత్తిదారులు సంఘాలుగా ఏర్పడితే లభించే ప్రయోజనాలను వివరించారు. వ్యవసాయ పరికరాలను తక్కువ ధరకే పొందవచ్చని తెలిపారు. డ్రమ్ సీడర్‌తో వరి సాగు చేయడం ద్వారా ఎకరాకు రూ.4వేల వరకు ఆదా చేయవచ్చని వివరించారు. వరి, మినుము, నిమ్మ పంటల సాగులో పాటించాల్సిన మెలకువలు, సస్య రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షలతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు లలితశివజ్యోతి, లోకేష్, విజయ్ కుమార్‌నాయక్, అనూష, సర్పంచ్ తేళ్ల వజ్రమ్మ,, వైఎస్సార్‌సీపీ నాయకుడు తేళ్ల శేఖర్‌రెడ్డి, ఎఫ్‌పీఓ చైర్మన్ ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు.

నేడు హనుమాన్ శోభాయాత్ర


జెండాలను సిద్ధం చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: గురుపౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలో హనుమాన్ శోభాయాత్రను ఆదివారం వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు బైపాస్‌రోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. రవితేజ కల్యాణ మండపం, పాత సినిమాహాల్ మీదుగా వైశ్యబజార్, సత్రం సెంటర్, చావడి, హిల్‌రోడ్డు, ఎరుకలసానినగర్, సోమశిలరోడ్డు సెంటర్, ఎల్ఆర్‌పల్లి, పోలీసు స్టేషన్, ఆర్టీసీ డిపో వరకు సాగుతుందని చెప్పారు. అక్కడి నుంచి తిరిగి మెయిన్ బజార్ మీదుగా మున్సిపల్ బస్టాండ్, అరుంధతీయకాలనీల మీదుగా రవితేజ కల్యాణ మండపం వద్దకు చేరుకుంటుందని వివరించారు. తొలుత అభయాంజనేయస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం సీతారామలక్ష్మణ హనుమంతుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చి యాత్రను ప్రారంభించనున్నట్లు వివరించారు.హనుమాన్ జెండాలను చేతబట్టి హిందువులు మోటార్ బైక్‌లపై శోభాయాత్రలో పాల్గొననున్నట్లు చెప్పారు. మహిళలు హనుమాన్ చాలీసా పారాయణం చేస్తూ యాత్రలో సాగు తారని తెలిపారు. శోభయాత్ర ముగింపు తరువాత సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో భారీస్థాయిలో అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు వివరించారు. హిందువులు అధిక సంఖ్యలో శోభాయాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఫోర్జరీ సంతకాలతో బిల్లులపై డీఎల్పీఓ విచారణ

కొండాపురం: మండలంలోని సత్యవోలు పంచాయతీ సర్పంచ్ గ్రామసభలు నిర్వహించకుండా వార్డు సభ్యుల ఫోర్జరీ సంతకాలతో బిల్లులు చేయించుకున్నారని టీడీపీ నాయకులు కొందరు డీపీఓకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఎల్పీఓ ఆదినారాయణ సత్యవోలు సచివాలయంలో శనివారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు సభ్యులను సంతకాలపై విచారించగా కొందరు తమవేనని, మరికొందరు తమవి కావని తెలిపారన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ నారాయణ, సర్పంచ్ పరుచూరి మాల్యాద్రి, ఎంపీటీసీ లెక్కల వెంకటరమణయ్య, పంచాయతీ కార్యదర్శి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీచ్ టూల్ శిక్షణ పరిశీలన


మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి సుధీర్ బాబు

ఆత్మకూరు: విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని ఏపీ గురుకుల బాలికల పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న టీచ్ టూల్ శిక్షణ తరగతులను జిల్లా నోడల్ అధికారి, అకడమిక మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు డిప్యూటీ ఈఓ గోపాల్‌తో కలిసి శనివారం పరిశీలించారు. విద్యార్థులకు సులభతరంగా పాఠాలను బోధించడంపై డివిజన్ స్థాయిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని సుధీర్‌బాబు తెలిపారు. ఉపాధ్యాయులు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు టీచ్ టూల్ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఎంఈఓలు ఎం జ్యోతి, కే చలపతి, మాస్టర్ ట్రెయినీలు సురేష్, నాగేశ్వరరావు, కేశవనారాయణ పాల్గొన్నారు.

సమస్యలకు పరిష్కారాలు ఏవి?

- మండల సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు


వింజమూరు: ఏఈ ఫయాజ్‌ను నిలదీసిన ఎంపీటీసీ వంశీ

వింజమూరు(ఉదయగిరి): మండల సర్వసభ్య సమావేశాల్లో విన్నవించిన సమస్యల పరిష్కారానికి అధికారులు ఒక్క అడుగు కూడా ముందుకు వేయడం లేదని పలువురు ప్రజాప్రతినిధులు నిలదీశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మోహన్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. తొలుత మండలాధికారులు తమ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను చదివి వినిపించారు. అనంతరం వింజమూరు–చాకలికొండ రోడ్డు అధ్వానంగా ఉన్నా గుంతలు పూడ్చకపోవడంపై ఏఈ ఫయాజ్‌ను ఎంపీటీసీ దేగా వంశీ నిలదీశారు. ఎన్నికలకు ముందు తాము చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయకుండా పార్టీ పరంగా ఇబ్బంది పెట్టడం సమంజసం కాదని వింజమూరు సర్పంచ్ సుగుణ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరప్రసాద్‌ను నిలదీశారు.దీంతో ఇరువురి మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. కాగా సర్వసభ్య సమావేశంలో సమస్యలపై నిర్మాణాత్మకంగా చర్చ జరగలేదు. ఒకరిద్దరు ప్రజాప్రతినిధులు సమస్యల గురించి ప్రస్తావించినా, మిగిలిన వారు ఎవరూ తమకు పట్టనట్లుగా వ్యవహరించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ కిరణ్ కుమార్, సీడీపీఓ పద్మకుమారి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు వనిపెంట హైమావతి, భవాని, ప్రసన్న, మౌనిక, సుమతి తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగా మండల సమావేశం

ఉదయగిరి : మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టడంతో సభ నామమాత్రంగా సాగింది. కాగా టీడీపీ నేతలు నిబంధనలకు విరుద్ధంగా సమావేశానికి వచ్చి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే సురేష్ ఫొటోలు ఎందుకు సమావేశ మందిరంలో పెట్టలేదంటూ ఎంపీడీఓ ఈశ్వరమ్మను నిలదీశారు. దీంతో కొంతసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభం

కలిగిరి: స్థానిక షిరిడీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సాయిబాబాకు పాలాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. బాబా విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుత్తలూరు: జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా విద్యుత్‌లైన్లు మారుస్తున్నందన మండల కేంద్రమైన దుత్తలూరులో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వెంకటసుబ్బయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దుత్తలూరు సెంటర్, దుత్తలూరు గ్రామం, బీసీ కాలనీ, కట్టకిందపల్లె హరిజనవాడ, తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపటి నుంచి గ్రామసభలు

చేజర్ల: రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలోని 26 పంచాయతీల్లో ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలలిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జలజీవన మిషన్, శానిటేషన్, ఓడీఎఫ్, తదితర అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

పోస్ట్‌మెన్‌కు సన్మానం



వరికుంటపాడు: మండలంలోని వేంపాడు బ్రాంచ్ పోస్టాఫీసు పరిధిలో పోస్ట్‌మెన్‌గా పనిచేస్తూ దుత్తలూరు పోస్టాఫీస్‌కు బదిలీపై వెళ్తున్న సుందర్‌రావును సహచర ఉద్యోగులు శనివారం ఘనంగా సన్మానించారు. వరికుంటపాడు సబ్‌పోస్టాఫీస్‌లో సబ్‌పోస్ట్‌మాస్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సుందర్‌రావును శాలువాలు, పూలమాలలతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు పాల్గొన్నారు.

సురక్షిత మంచినీటిని అందించేందుకు కృషి


స్టోరేజ్ ట్యాంకును పరిశీలిస్తున్న అధికారులు

అల్లూరు: నగర పంచాయతీ ప్రజలకు సురక్షిత మంచి నీటిని అందించేందుకు కృషి చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ తిరుమలకుమార్ తెలిపారు. అల్లూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి మంచి నీటి సరఫరా జరగడం లేదని తమ దృష్టికి రావడంతో క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు వచ్చామన్నారు. ట్యాంకుకు నీటిని అందించే ప్రధాన కాలువ పూర్తిగా పూడిపోయి ఉందన్నారు. మోటార్లు, పైపులైన్లు మరమ్మతులకు గురై ఉన్నాయన్నారు. తాగునీటి సరఫరా పునరుద్ధరణకు దాదాపు రూ.70 లక్షల వరకు నిధులు అవసరమవుతాయన్నారు. జిల్లా పరిషత్‌కు ప్రతిపాదనలు పంపుతామన్నారు. ఆయన వెంట డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ రంగస్వామి, టీడీపీ నాయకులు ఉన్నారు.

డీజిల్ లేక నిలిచిన ఆర్టీసీ బస్సు

- ఇబ్బందిపడిన ప్రయాణికులు

ఉదయగిరి: ఉదయగిరి నుంచి హైదరాబాద్‌కు కొత్త సూపర్ లగ్జరీ సర్వీసును రెండ్రోజుల క్రితం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జెండా ఊపి ప్రారంభించిన విషయం తెలిసిందే. శనివారం బస్సు తిరుగు ప్రయాణంలో ప్రకాశం జిల్లా కనిగిరి సమీపంలో డీజిల్ లేక నిలిచిపోయింది. బస్సు డ్రైవర్ డీజిల్ తెచ్చి పోసినా స్టార్ట్ కాలేదు. దీంతో ప్రయాణికులు రెండు గంటల పాటు ఇబ్బంది పడ్డారు. అనంతరం వేరే బస్సు ద్వారా ప్రయాణికులను ఉదయగిరికి తరలించారు. కొత్త బస్సు మొరాయించడంపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఉదయగిరి డిపో మేనేజర్ శ్రీనివాసులను వివరణ కోరగా కొత్త బస్సు కావడంతో డీజిల్ ఎక్కువగా ని, డ్రైవర్‌కు అవగాహన లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని తెలిపారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం


సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ శ్రీనివాసులు

మర్రిపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు డ్వామా ఇన్‌చార్జి పీడీ శ్రీనివాసులు తెలిపారు. మండల ఉపాధి హామీ కార్యాలయాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఉపాధి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద ఆత్మకూరు, మర్రిపాడు మండలాల్లో ఆరు వేల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించి సాగును ప్రోత్సాహించాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు

ఆత్మకూరు: గురుపౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని శివాలయ ప్రాంగణం, వైశ్య బజారులో ఉన్న సాయిబాబా మందిరాలు, కాశీనాయన ఆశ్రమంలోని ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయిబాబా మందిరాల్లో బాబాకు క్షీరాభిషేకం నిర్వహించనున్నారు. సాయిబాబా విశేషాలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. మధ్యాహ్నం భారీ స్థాయిలో అన్నప్రసాద వితరణ చేయనున్నారు. సాయంత్రం పల్లకిసేవ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గురుపౌర్ణమికి ఆలయాల ముస్తాబు

ఆత్మకూరురూరల్: గురుపౌర్ణమి వేడుకలకు మండలంలోని ఆలయాలను ముస్తాబు చేశారు. మహిమలూరు, గండ్లవేడులోని సాయిబాబా మందిరాలు, మహిమలూరు, బట్టేపాడు గ్రామాల్లోని వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు విక్రయం

ఆత్మకూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదురు వీధిలో ఉన్న సింహాద్రి మెగామార్ట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ ద్వారా ప్రజలకు తక్కువ ధరకు బియ్యం, కందిపప్పును ఆదివారం నుంచి అందించనున్నట్లు ఆత్మకూరు ఆర్డీఓ మధులత శనివారం తెలిపారు. మార్కెట్లో కిలో కందిపప్పు రూ.181 ఉండగా, ప్రత్యేక కౌంటర్‌లో రూ.160కు అందజేస్తున్నట్లు చెప్పారు. మార్కెట్లో నాణ్యమైన సన్న బియ్యం రూ.55 ఉండగా, ప్రత్యేక కౌంటర్‌లో రూ.49కు అందజేస్తున్నామని తెలిపారు. మార్కెట్లో ముడి బియ్యం రూ.52.40 ఉండగా, రూ.48కు అందజేస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీసీఆర్ కార్డులతో బహుళ ప్రయోజనాలు


సీసీఆర్ కార్డులపై కౌలు రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ కిషోర్

ఆత్మకూరురూరల్: ప్రభుత్వం కౌలు రైతులకు అందజేస్తున్న పంట సాగు హక్కు పత్రాలతో బహుళ ప్రయోజనాలు లభిస్తాయని మండల వ్యవసాయాధికారి కిషోర్ పేర్కొన్నారు. వెంకట్రావుపల్లి, పంటవీధి సచివాలయాల పరిధిలో పంట సాగు హక్కు పత్రాలపై కౌలు రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసే సబ్సిడీ విత్తనాలు, పంట బీమా పథకం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టపరిహారం, తదితర ప్రయోజనాలు కలుగుతాయన్నారు. సీసీఆర్‌సీ కార్డులు పొందేందుకు దరఖాస్తు చేసుకునే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, రహ్మతుల్లా, లావణ్య, రైతు సేవా కేంద్రాల వీఏఏలు ఇంద్రాని, రేణుక, స్థానిక రైతులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం

చేజర్ల: స్థానిక పడమటి వీధిలోని కోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా శనివారం సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా శనివారం నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సంగం బ్యారేజ్ వద్ద యాత్రికుల సందడి


యాత్రికుల భద్రతను పర్యవేక్షిస్తున్న పోలీసులు

సంగం: సంగం బ్యారేజ్ వద్ద శనివారం యాత్రికుల సందడి నెలకొంది. నెల్లూరు బారాషహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండగకు వచ్చిన భక్తులు ఏఎస్పేటలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాను సందర్శించుకునేందుకు వెళ్తూ మార్గం మధ్యలో సంగం బ్యారేజ్ వద్ద విడిది చేశారు. కుటుంబ సమేతంగా బస్సుల్లో వచ్చిన యాత్రికులు సంగం బ్యారేజ్ వద్ద తమ వాహనాలను నిలుపుకుని వంటావార్పు చేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. సంగం ఎస్సై నాగార్జునరెడ్డి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, ప్రమాదాల బారిన పడకుండా తమ సిబ్బందితో తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.

గండిపాళెం జలాశయం గేట్ల పరిశీలన

ఉదయగిరి: గండిపాళెం జలాశయం క్రస్ట్ గేట్లను ఇరిగేషన్ అధికారులు శనివారం పరిశీలించారు. గేట్లు మరమ్మతులకు గురై కొంత మేర నీరు లీకేజీ జరుగుతోంది. ఈ నేపథ్యంలో గేట్ల మరమ్మతులకు ఉన్న అవకాశాలను పరిశీలించినట్లు డీఈ చంద్రమౌళి తెలిపారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీరు లీకేజీ కాకుండా ఉండేందుకు త్వరలో మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. ఆయన వెంట ఏఈలు సురేష్,వేణు ,సిబ్బంది ఉన్నారు.

షాపులో చోరీ

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం జువ్విగుంటపాళెం వద్ద జాతీయ రహదారి పక్కనున్న రమేష్ అనే వ్యక్తి షాపులో శుక్రవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. శనివారం ఉదయం షాపు తెరిచేందుకు వచ్చిన రమేష్ తాళాలు పగులగొట్టి ఉండడం గమనించారు. కౌంటర్‌లోని రూ.1000 నగదు, 20 లీటర్ల పెట్రోలు, ఇతర వస్తువులను అపహరించుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు.

ప్రభుత్వ బాలుర వసతిగృహం పరిశీలన


శ్లాబ్‌ను పరిశీలిస్తున్న మూలి వెంగయ్య

మర్రిపాడు: స్థానిక ప్రభుత్వ బాలుర వసతిగృహాన్ని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు, సీపీఎం నాయకుడు మూలి వెంగయ్య శనివారం పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతిగృహం శిథిలావస్థకు చేరి ఉరుస్తోందని తెలిపారు. శ్లాబ్ దెబ్బతిని పెచ్చులూడి పడుతుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బాలుర వసతిగృహ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.